# 18. పరాయైన రతీ మన్మధులు

ఒకప్పుడు మన కేంద్ర ప్రభుత్వంలో ఆరోగ్య మంత్రిణిగా ఉన్న రాజకుమారి అమృతకౌర్ ఉత్తర భారతంలోని కపుర్తలా సంస్థానాధీశుల వంశానికి చెందిన విదుషీమణి. ఆవిడ మేనత్త రాకుమారి గోవిందకౌర్ ఒక విధంగా ఆ సంస్థాన చరిత్రలో సుప్రసిద్ధురాలు

ఆవిడ మహారాజా నిహాల్ సింహజీ వారి ముద్దుల బిడ్డ. అసూర్యం పశ్య, గారాలపట్టి, సౌందర్యరాశి, ఆవిడ రాజ ప్రాసాదానికి సమీపంలోనే తన కోసం ప్రత్యేకంగా నిర్మించిన ఆరంతస్తుల దివ్య హర్మ్యంలో సకల భోగాలమధ్య రతీదేవిలా వెలిగిపోతుండేది. ఆ భవనం చుట్టూ బలమైన ప్రాకారం ఉండేది. అందులో ప్రవేశించేందుకు ఒకే ఒక ద్వారం. సాయుధులైన పహరా వారిని దాటి పోతుటీగయినా ఆ భవనంలో ప్రవేశించే వీలులేదు.

గోవిందకౌర్‌కు సంస్థానంలోని ధనవంతులలో ఒకరూ, మంచి పలుకుబడీగల ఓ రాచవంశీకునితో వివాహం అయించి. అయితే సదరు దివ్య హర్మ్యాన్నీ, అక్కడి వైభోగాలనూ వదలలేని గోవిందకౌర్ ముందే ఒక షరతు పెట్టింది. అదేమంటే వరుడే ఇల్లరికం వచ్చి తనతో కలిసి ఆమహా భవనంలోనే నివసించాలని. వరుడున్నూ అందుకు సంతోషంతోనే అంగీకరించాడు.

కానీ, కానీ... !

అతడు రాచవంశీకుడేగానీ అందగాడు గాదు. సరిగదా ఓరకంగా

కురూపి. అనదగి, సమస్త బలహీనతలూ, అనారోగ్యం ఇత్యాదికలవాడు రాచపురుషులకు ఎన్ని ఉన్నా రాచరక్తం విలువైనది గనుక గోవిందకౌర్ అనే రతీదేవి పాలిట అతనే నవ మన్మధుడైపోయాడు.

అయితే, పెళ్ళంటూ జరిగిందేగానీ సదరు రతీదేవి మాత్రం తన మన్మధుడిని ఏలుకోకపోగా కనీసం కన్నయినా ఎత్తి చూడలేదు. ఆవిడకు ఈ రాచ మన్మధుడి కన్నా అందుబాటులోగల దారిన పొయ్యే దానయ్యలూ, చివరికి భవనాన్ని కాపలాకాసే అంగరక్షకులే ఆప్తులయ్యారు. తనతో శయ్యనలంకరించదగిన వారయ్యారు. ఆ విధంగా ఆవిడ రష్యన్ కేధరిన్, ఈజిప్టియన్ క్లియో పాత్రాలను మించిపోయింది. ఈ సంగతి గ్రహించిన భర్త తన మానాన తాను పుట్టింట బ్రతకసాగాడు.

ఓ సుదినాన కల్నల్ వైరాం సింగ్ అనే ఉన్నత సైనికాధికారి గోవిందకౌర్ భవనం వద్దగల అంగరక్షక దళాన్ని తనిఖీ చేసేందుకు వచ్చి, అదేసమయంలో బాల్కనీలో సుస్నాతయై కురులారబెట్టుకుంటున్న రాకుమారినిచూసి, ఆవిడ సౌందర్య ప్రభలకు చలించి సమ్మోహితుడవగా... !

సదరు రతీదేవిని సమీపించటం ఎలాగనే ప్రశ్న ఎదురయ్యింది.

వైరాంసింగ్ యువకుడు, ధృఢకాయుడు, సుశిక్షితుడైన సైన్యాధికారి. అతని వంశీకులు కపూర్తలా సంస్థానానికి గతంలో గణనీయమైన సేవలు చేసి ఉన్నత స్థానాలు నలంకరించిన యోధులు.

కానీ, వైరాంసింగ్ ఎంతటివాడైనా ఆభవనం గేటుదాటి ప్రవేశించే వీలులేదు. అటు గోవిందకౌర్ కూడా ఈ యువకుడిని చూసినప్పటినుంచి అతన్నే తలుచుకోసాగింది. ఇదంతా గమనించిన వాసంతి అనే పరిచారిక

అలనాటి నలదమయంతుల పాలిటి హంసలా వారిరువురి మధ్యాదౌత్య కలాపానికి నాంది పలికింది

చివరికి తేలిందేమంటే ఆ దివ్యహర్మ్యపు ప్రహరీ గోడను అనుకునే లోపలి వైపున ఓ మంచి నీళ్ళ బావి ఉంది. ఆ బావి గోడ కూడా భవనపు ప్రహరీ గోడలో ఒక భాగంగా కలసిపోయింది. వైరాంసింగ్ శ్రమపడి అక్కడ ప్రహరీ గోడలోంచి అతి జాగ్రత్తగా కొన్ని రాళ్ళను వదులుచేసి మనిషి పట్టేంత ద్వారం రూపొందించేడు. రోజూ సంధ్య చీకట్లు అలుముకోగానే ఆ కన్నం గుండా బావిలోకి దూకేవాడు రాకుమారి ఓ బకెట్‌ను బావిలోకి దింపేది. వైరాంగ్‌సింగ్ అందులోకి చేరగా చెలికత్తె సాయంతో బకెట్‌ను పైకి లాగేది, ఆ విధంగా వైరాంసింగ్ మరెవరికంటా పడకుండా రాకుమార్తె పడకగదిలోకి సులువుగా ప్రవేశించ గలుగుతుండేవాడు. రాత్రంతా సదరు రతీమన్మదులు వాత్స్యాయనుడికి పాఠాలు నేర్పగల విధంగా మైకంలో మునిగి పోయేవారు.

రాకుమారి పడకగదిలో అక్షరాలా స్వర్ణతల్పం ఉండేది. దానిమీద వెలలేని బనారస్ పట్టు దుప్పట్లు, పరుపులు పరచి వుండేవి. మల్లెలు, గులాబులతో పాన్పేగాక శయనాగారమంతా నిండి, సుంగధం గుభాళిస్తుండేది. ఆ సుఖాలనూ, సౌందర్యాన్ని వదలలేక వదలలేక తప్పనిసరై వైరాంసింగ్ వేకువకు ముందే వచ్చిన దారినే భవనం నుండి నిష్క్రమిస్తుండేవాడు. గోడకు చేసిన కన్నం ఏ మాత్రం జాడ దొరకకుండా తిరిగి మూసివేస్తుండేవాడు.

ఈ విధంగా ఓ రెండేండ్లపాటు ఆ యువ ప్రేమికులు జీవితామృతాన్ని మధించేక...

ఓ దుర్దినాన సాక్షాత్తూ వైరాంసింగ్‌కు బద్ధశత్రువైన కపుర్తలా

సంస్థాన రక్షణ మంత్రి సర్దార్ ధనిష్మంద్‌కు ఈ రహస్య ప్రణయో దంతం తెలిసి పోయింది. దాంతో దొరికాడురా వైరాంసింగ్ అనుకుని వైరం తీర్చుకునేందుకు రాచ ప్రాసాదం వద్ద కాపలా వేశాడు. చివరికి ఓ సంధ్యవేళ కన్నంలోంచి లోనికిచేరిన వైరాంసింగ్ వెనుకేవెళ్ళి, కన్నాన్ని మూసివేసి, అక్కడ కాపలా పెట్టి, మంత్రులూ, సర్వ సేనా పతీ, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అందరూ సాక్షులుగా వెంటరాగా భవన ప్రధాన ద్వారాన్ని ముట్టడించాడు.

కానీ... !

బ్రహ్మాండమైన సదరు భవనపు గేట్లను తెరిపించి వీరందరూ రాకుమారి శయనాగారం చేరి చూడగా... !

అక్కడ వైరాంసింగ్ కాదుగదా, కనీసం రాకుమారి గోవింద్‌కౌర్ కూడా లేదు. భవనం ఎంత గాలించినా వారి జాడలు ఏ మాత్రం లభ్యం కాలేదు.

జరిగిందేమంటే... !

వీరిక్కడ రాచప్రాసాదపు మెయిన్ గేటువద్ద చేరగానే ఆ కల కలాన్ని బట్టి రానున్న ప్రమాదాన్ని రతీమన్మధు లిరువురూ గ్రహించే శారు. తత్క్షణం వారిరువురూ ఆ భవనంలోగల ఓ సొరంగం గుండా రాచ ప్రాసాదాన్ని వదలి బయట పడ్డారు. ఆ సొరంగం అలా ఓ వంద గజాలు నడిచాక ఓ బావిలో అంతమవుతుంది. వీరిరువురూ తెల్లవారేదాకా ఆ బావినీళ్ళలో చలికి వణికిపోతూ గడిపి వేసారు.

తొలి వెలుగు రేఖలు పొడచూపగానే వారిరువురూ ఏకధాటిన ఇరవై మైళ్ళు నడిచి ఆ సంస్థాన సరిహద్దుదాటి, బ్రిటిష్ వారి ఆధీనంలో

గల ప్రాంతంలోని అడవుల్లో ప్రవేశించారు. ప్రవేశించాక 'హమ్మయ్య' అని ఊపిరి తీసుకున్నారు.

ఎట్టిపరిస్థితుల్లోనూ కపూర్తలా సంస్థానాధికారులుగానీ, సైనికులు గానీ ఆ ప్రాంతంలో అడుగిడజాలరు. వారిపై కపూర్తలా ఈగలు కూడా వాలలేవు.

అడవిలో కావలసినన్ని దుంపలు, కాయలు. వారిరువురూ కష్టపడి కర్రలతో, మట్టితో ఓ ఇల్లు కట్టుకున్నారు. రతీదేవి ఆవు పేడతో పిడ కలుచేసి పొయ్యి వెలిగిస్తే, మన్మదుడు క్రమంగా వాగుతట్టు భూమిలో కొంత సాగులోకి తెచ్చేడు. ఆ విధంగా వారిరువురూ అసలు, సిసలు వనంలోని ప్రేమపక్షులుగా బ్రతికి చరిత్రలో ఆ తర్వాత ప్రసిద్ధులయ్యేరు.

★